మింగడానికి మెతుకు లేకపోయినా అయ్యేయస్ కావాలనే కోరికను అతను ఎలా తీర్చుకొన్నాడు?

శారదా అశోకవర్ధన్ కథ

# బి.బి.పతి, ఐ.ఏ.ఎస్!

"అమ్మో!... అయ్యో!.. అమ్మో!..." కేకలు పెడుతూ ఏడుస్తున్నాడు వాడు.

"నీయవ్వ... కొట్టి కొట్టి నా సేతులు నొత్తన్నాయ్ కానీ, నీకు బుద్దిరాదు గదరా, గాడిద కొడకా" మరోసారి బాదింది లచ్చి.

ఈ హృదయ విదారకమైన దృశ్యం చూసి కరిగిపోయాడు బి.బి.పతి, ఐ.ఏ.ఎస్!

"డ్రైవర్! కారాపు" అరిచాడు పిడుగు పడ్డట్టుగా.

డ్రైవర్ సడన్ బ్రేక్ వెయ్యడంతో కారు కాస్త అటు ఇటు కదిలి ఆగింది.

"అమ్మా! ఆ పిల్లాడ్ని ఎందుకలా కొడుతున్నావ్?" అడిగాడు కారులో నుంచే పతి!

లచ్చి ఆశ్చర్యంగా అతని కేసి చూసింది 'నొక్కు నొక్కుల క్రాపూ, తీరైన కనుముక్కు తీరూ, రంగు నలుపైనా కళైన మొహం, ఎవరో పెద్ద మనిషిలా వున్నాడు' అనుకుంటూ, నోట మాటరాక మూగిలా వుండిపోయింది. ఆ పిల్లాడు ఏడుపుస్థాయి తగ్గించాడే కానీ మానలేదు. దెబ్బలు తగిలినచోట చేత్తో రాసుకుంటూ, కారులో వున్న అతణ్ణే చూస్తున్నాడు.

మాట్లాడకుండా నుంచున్న ఆమెను చూస్తూ 'అలా కొట్టొచ్చా?' అన్నాడు! అప్పటికి తేరుకుంది షాక్‌లో నుంచి!

"నా పిల్లాడు నా ఇట్టం! కొట్టుకుంటాము సంపుకుంటాను.' మధ్యలో మీరెవరూ? ఆయిగా కారులో కూకుండి 'కొట్టొచ్చా' 'తిట్టొచ్చా' అని నీతులు సెబుతావున్నావు.



కట్టాలంటే దొరబాబులు మీకేం తెలుస్తాది? కాలే కడుపులు మాకు తెలుస్తాది!'' మనసులో వున్న బాధంతా వెళ్లబోసుకుంది లచ్చి.

పతి కారు దిగాడు! కళ్లజోడు సవరించుకున్నాడు.

''చూడమ్మా నీ పేరేంటి?'' అడిగాడు శాంతంగా!

"లచ్చి! అయినా నా పేరుతో మీకేం పని? మల్లా ఎలక్షన్లు గిన్నా ఒత్తన్నాయా ఏంటి? ఇంత పేమగా మా గుడిసికాడ కారాపి మాట్టాడతావున్నావు?" చేతులు తిప్పుకుంటూ అంది లచ్చి.

పతి నవ్వాడు!

"బాబూ! నీ పేరేంటి?" పిల్లాడి కేసి చూసి నవ్వుతూ అడిగాడు. వాడు ఏడుపు మాని కళ్లు తుడుచుకుంటూ 'బిచ్చమయ్య' అన్నాడు.

పతి వులిక్కిపడ్డాడు వెంటనే తేరుకుని "మీ అమ్మ నిన్ను ఎందుక్కొడులోంది? అల్లరి చేశావా" బుజ్జగిస్తూ అడిగాడు. ఎన్నడూ అంతటి ప్రేమని చవిచూడని ఆ పిల్లాడు ఆశ్చర్యంగా అతని కేసి చూస్తూ "ఇయ్యాల పనికి పోనన్నానని కొడ్తన్నది" అన్నాడు అమాయకంగా. పతి గుండె క్షణక్షణం కరిగి నీరవుతోంది!

'పనికి ఎందుకు పోనన్నావ్?' మళ్లీ అడిగాడు పతి. వాడు మాట్లాడలేదు. మౌనంగా నుంచున్నాడు తలొంచుకుని!

'ఇస్కోలికి పోతడట! ఆడ ఓ గిలాసపాలు బోత్తరు! తాగి రానీకి! ఏందంటే సదువుకుంటన్నా అంటడు పోరగాడు. పాలు పోదుగాను, ఒక్క గిలాస తాగితే అయిపోతదా? పనికిబోతే నాల్రూపాయిలొత్తయ్! ఈ ఇస్కోల్లో పొంచ్చి మా పానాలు తీత్తండ్రు' స్కూలుని తిట్టిపోసింది లచ్చి. జేబులోంచి కర్చీఫ్ తీసి కళ్లు తుడుచుకున్నాడు మిస్టర్ బి.బి.పతి, ఐ.ఏ.ఎస్! అతని హృదయం కరిగి నీరు కారుతోంది?

"లచ్చీ! నీ బాబుని మా ఇంట్లో పనికి పెడతావా? నీకు కావలసిన జీతం ఇస్తాను! వాడి అవసరాలు నేను చూసుకుంటాను" అడిగాడు పతి.

లచ్చి నోరు తెరిచి చూసింది అతని వంక!

'మీ ఇల్లెక్కడ?' అడిగింది కాస్సేపటికి!

ఇక్కడిమంచి రెండు సందుల అవతల, రామాలయం దగ్గర.

"ఏం పని సెయ్యాలేటి? ఏవో చిన్న చిన్న పన్లు. అమ్మగారి చేతికిందుండాలి! మాకో చిన్న బాబున్నాడు. వాడితో ఆడుకోవాలి!

"మరి మావోడికి రోజూ నాల్రూపాలొత్తయ్!.. మరిగాంటే..!" నసిగింది లచ్చి

'చెప్పు ఎంతకావాలో?'

'మీ ఇష్టం! మీరే ఆలోసించి సెప్పండి.'

'రోజుకి నాలుగు రూపాయలంటే నెలకి మూటా ఇరవై రూపాయలు, నేను నెలకి మూట యాభై ఇస్తాను నీ కిష్టమేనా?' అమాంతం లచ్చి అతని కాళ్ల మీద పడిపోయింది.

'లేమ్మా లే' అంటూ లేవనెత్తాడు పతి.

లచ్చి ఏడుస్తూ 'నువ్వు దేవుడవు దొరా! మమ్ముల రచ్చించడానికే ఒచ్చినవు! మా బిచ్చమయ్య నెలకి మూట యాభై రూపాల కొలువు సేత్తడంటే నాకే నమ్మేటట్టు లేదు. ఇగరారా పోరగా! అయ్యగారి కాళ్ల మీద పడు! దేవుడొచ్చినట్టొచ్చిండు దొర!" అంటూ గబగబా వెళ్లి వాణ్ణి తెచ్చి అతని కాళ్లమీద పడేసింది! వాణ్ణి లేవనెత్తి

'రేపొద్దున్నే ఒచ్చేసెయ్! లచ్చీ! ఎనిమిది గంటలకల్లా ఒచ్చేయండి' అంటూ వెళ్లి కారెక్కి కూర్చున్నాడు పతి! గుండెల మీద ఏదో బరువు దించినట్టయింది!

రథంలా కదిలిపోతున్న కారు కనుమరుగయ్యేంత వరకూ చూస్తూ వుంది లచ్చిమి, బిచ్చమయ్యనీ, లింగడినీ, నర్సమ్మనీ, గంగమ్మనీ చుట్టూ కూర్చోబెట్టుకుని చంటిపిల్ల బాలమణికి పాలిస్తూ! ఆమె మనసు గాలిలో తేలిపోతోంది! నెలకీ నూట యాభై రూపాలు! 'బిచ్చమయ్య అదృష్టమంతుడే!' అనుకుని మురిసిపోయింది. పాలు ఎక్కువగా ఒచ్చేసినట్టున్నయ్, పొలమారి బాలమణి ఉక్కిరిబిక్కిరై దగ్గుతూ వుంటే, ఆలోచనల్లోంచి తేరుకుని, 'ఓ... ఓ... ఓ...' అంటూ వీపు రాసింది బాలమణికి లచ్చి!

* * *

'బి.బి.పతి, ఐ.ఏ.ఎస్' తన ఇంటి గేటు మీద బోర్డు చూడగానే మళ్లీ ఆలోచనలన్నీ ముసురుకున్నాయ్ మనసుని!

'ఒరేయ్ బిచ్చుగా! యాడ వచ్చినవ్రా? నీ ఆలి ముండ మొయ్యా ఎన్నిసార్లు సెప్పాల్రా! ఇయ్యాల రాజాబాబుది పుట్టిన దినమట, దోస్తులొస్తుంద్రట! పాలు బల్దిగ దెమ్మన్నది. రెండు పాకెట్లు ఎక్కువ దెమ్మన్నది. ఇచ్చి రా పోరా! పొద్దు బోతాలిద్దదీ' దండకం వల్లించింది మీనమ్మ. మట్టిలో వేలుతో బొమ్మలు గీస్తున్న బిచ్చుగాడు ఏదో స్ఫురించినట్టు 'అమ్మా' ఇయ్యాల రాజాబాబుది పుట్టిన దినమా?'

'అవు'. గుడిసె ముందు ఊడుస్తూ చెప్పింది మీనమ్మ.

'అమ్మా...'

'ఏందిరా అమ్మా అమ్మా అని నా వెంటబడ్డవ్ పో! పొద్దుబోతంది'' ఉరుముతా అరిచింది ఆమె.

వాడు కదల్లేదు! అక్కడే నుంచున్నాడు. తల్లి కేకలూ, తిట్లూ వాడికి వినబడ్డం లేదు. వినబడినా అవి రోజూ అలవాటే వాడికి.

'రాజా బాబూ నేనూ ఒక్క రోజే పుట్టినమని జెప్పినవ్ కదా! అంటే ఇయ్యాల నా పుట్టిన దినం కూడా!'



## పేద వ్యాసం

పేదరికం మీద వ్యాసం రాయమన్నారు మాస్టారు.

''అనగనగా ఒక పేదకుటుంబం. ఆ కుటుంబంలో తండ్రి, తల్లి పేదవాళ్లు. వాళ్ళ పిల్లలు అంతకన్నా పేదవాళ్లు. వాళ్ల తోటమాలి పేదవాడు, వాళ్ల పనిమనిషి, వంట మనిషి పేదవాళ్లే... చివరికి వాళ్ళ కారు డ్రైవర్ కూడా పేదవాడే...'' అని రాసాడు ఓ లక్షాధికారి కొడుకు.

-పి. రాము (గుంటూరు)

'ఓయమ్మో! మన మొకాంకి పుట్టిన దివాలు గూడనంట! మింగేతందుకు మెతుకు లేదంట, పిపాలకు సంపెంగ మానె నంట! ఫో... ఫో!...' కపిరింది గట్టిగా. ఆ అరుపుకి భూమి కంపించినట్టయింది. వెంటనే వెళ్లి పాల పాకెట్లు పెట్టిన సంచీని తీసుకుని బయల్దేరాడు బిచ్చుగాడు!

పెద్ద గేటులోంచి, దారికిరువైపులా పూచిన గులాబీ చెట్ల తొట్టెలను దాటి, రకరకాల క్రోటెన్ మొక్కల మధ్య నుంచి వరండాలోంచి, లోపలికెళ్లాడు బిచ్చుగాడు! ఆ గది ఎంతో అందంగా అలంకరించి వుంది రోజా కన్నా కూడా! గదంతా రంగు రంగు కాగితాలతోటీ, బెలూన్‌ల తోటీ, తోరణాలు కట్టినట్లుగా నిండి వుంది. కుర్చీలు వరుసగా అమర్చి వున్నాయ్! రాజాబాబూ సిల్క్ పైజామా కుడ్తా వేసుకుని, కొత్త బట్టల తోటీ, కొత్త చెప్పులతోటీ మెరిసిపోతున్నాడు. వాళ్ల నాన్నగారు అప్పుడే షాపునుంచి తెచ్చిన బంగారు వుంగరాన్ని రాజాబాబు చేతికి పెడుతూ ముద్దుపెట్టుకున్నాడు అతడి బుగ్గల మీద.

'నాన్నగారి కాళ్లకు దండం పెట్టమ్మా' అంది పెద్దమ్మగారు. అంటే రాజాబాబు నాయనమ్మగారు. రాజాబాబు వంగి దండం పెట్టేడు. తలమీద అక్షంతలు వేస్తూ

'బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ ఆఫీసరువి కావాలి!' ఆశీర్వదించారు లక్ష్మీకాంతరావు గారు.

ఇదంతా చోద్యంగా చూస్తూ నిల్చున్నాడు బిచ్చుగాడు. 'హేప్ రాజాచంద్ర! హాప్పీ బర్త్‌డే' అంటూ రాజాబాబు స్నేహితులు, పెద్ద పెద్ద ప్యాకెట్లు అతని చేతిలో పెడుతూ రాజాబాబు అందించిన ప్లేట్లూ కేకూ తింటున్నారు.

కేకు కట్ చెయ్యడం దగ్గర్నుంచి అంతా వింతగా చూస్తూ నిల్చుండి పోయాడు బిచ్చుగాడు. 'రాజాబాబు పూర్తి పేరు రాజాచంద్ర' వొక్కి వొక్కి పలుకుతూ మనసులోనే మననం చేసుకున్నాడు పదే పదే! 'మరి తన పూర్తి పేరో! అమ్మ నడగాలి! అమ్మ తనకి ఒక్క కొత్త చొక్కా లాగూ కూడా కొనలేదు. తనూ రాజాబాబూ ఒక్క రోజే పుట్టారట! రాజాబాబు తనకంటే ఒక్క గంట పెద్దవాడట. అంతే!' ఒక్క నిమిషం వాడి బట్టల కేసి చూసుకున్నాడు. చింకి చొక్కా చింకిలాగూ. దుమ్ము పట్టిన వొళ్లు! తైల సంస్కారం లేని జుట్టు.' ఇంకెవరో కార్లో వచ్చారు. పెద్ద బహుమతి తెచ్చిచ్చారు.

'బాగా చదువు కోవాలి! ఐ.ఏ.ఎస్ ప్యాసయిపోవాలి' అన్నాడాయన.

'ఐ.ఏ.ఎస్' బట్టీ పట్టాడు బిచ్చు. దాని అర్థం ఏమిటో తెలీలేదు. రేపు బడికెళ్లి మాస్టార్నడగాలి.'

వాడి చేతులో ఒక కేకు ముక్కా, బూందీ తీసుకొచ్చి పెట్టింది రాజాబాబు తల్లి. 'ఇంక వెళ్లు' అంది వాడు అందుకే నుంచున్నట్టుగా! బిచ్చుకి బాధ కలిగింది. గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు.

'అమ్మా! రేపటి నుంచి నేను పాలకి పోను.'

ఆశ్చర్యంగా చూసింది మీనమ్మ. 'ఎందుకని?' అడిగింది.

'సదువుకోను బడికి పోతా'

'పచ్చివోడ్డికి సోకులు ముట్టినట్టున్నయ్! బంగ్లాకి పోయి రాంగనే ఏందో, తల తిరుగుతుందా ఏంది?' పొయ్యిలో కట్టెలు మండక పొగమట్టుకుపోతూంటే ఊదుతూ అంది మీనమ్మ.

బిచ్చు మాట్లాడలేదు. వాడి బుర్ర నిండా ఆలోచనలే. ఉన్నట్టుండి 'అమ్మా' నా పేరు బిచ్చుగాడేనా? ఇంకేమన్నా వున్నదా? రాజా బాబు పేరు రాజా చం...ద్ర...వంట'

'నీ పేరు బిచ్చపతి!'' అంది పళ్లెంలో అన్నం పెట్టి, కారం వేస్తూ.

'బిచ్చపతి'! మళ్లీ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

'తిందువురా' అరిచింది తల్లి.

'నాయన రానీ' అన్నాడు బిచ్చు.

'నాయనెప్పుడొస్తాడు! రాతిందువు! పొద్దుపోతంది' పిలిచింది.

ఇక లాభం లేదని రెండు మెతుకులు తిని లేచాడు.

తండ్రి తాగి రావడంతో, మీనమ్మ అరుపులు అతని మీద పడ్డాయ్.

బిచ్చు గోనె పంచీ పరుచుకుని పడుకున్నాడు.

మనసు నిండా ఆలోచనలు! అవ్యక్తమైన కోరికలు, తెల్లవార్లూ జాగరణే చేశాడు ఇంచుమించు!

* * *

పొద్దున్నే స్నానం చేసి ఉతికిన బట్టలు వేసుకుని వెళుతున్న కొడుకుని చూసి 'యాడకిరా!, కొలువుకి బోవా?' అన్నమాటలు వినిపించుకోకుండానే వెళ్లిపోయాడు బిచ్చు.

వాణ్ణి చూసి ఆశ్చర్యంగా 'ఏరా ఇలా ఒచ్చావ్?' అడిగారు కామేశ్వరరావు మాస్టారు.



## అద్భుత అసహ్యం

కొన్ని దేశాలలో ప్రతిరోజూ అందరూ స్నానం చెయ్యరని మనకు తెలుసు! కానీ... 116 సంవత్సరాల పాటు అసలు స్నానమే చెయ్యకుండా కాలం వెళ్లబుచ్చిన ఓ స్త్రీ గురించి మీకు తెలుసా? లండన్‌కు చెందిన జేన్‌లూసన్ అనే మహిళ నీళ్లను ముట్టుకుంటే 'జలుబు' చేస్తుందనే భయంతో అలా స్నానం చేయకుండా కాలక్షేపం చేసిందట. క్రీ.శ. 1700 సంవత్సరంలో పుట్టిన ఆ మహిళ స్నానం చెయ్యకపోయినా... 116 సంవత్సరాలు బతికిందంటే ఆశ్చర్యమే మరి! అందుకే... రోజుకు రెండుసార్లు స్నానంచేసే మనలాంటి వారికిది అద్భుతంగా కాక... అసహ్యంగా కన్పిస్తుంది కదూ!?

జూపిటర్.

'సార్! నాకు చదువుకోవాలనుంది'

"చాలా సంతోషం! ఇవ్వాళ మంచే, బడికిరా!' బిచ్చు మాట్లాడలేదు."

'ఏరా? ఇవాళ కుదరదా?'

'సార్ నాతావ పైసల్లేవు. పుస్తకాలకీ... జీతానికీ...'

"ఆ గొడవ నీకెందుకు? మీ నాన్ననో అమ్మనో రమ్మను నేను మాట్లాడతాను."

'సార్ ఆళ్ల రారు. నేను ఇస్కూలుకి రావడం ఆళ్లకిష్టం లేదు. నేను కొలువు జేసి పైసలయ్యాలి ఆల్లకి.'

కామేశ్వరావు మాష్టారి కళ్లల్లో నీళ్ల తిరిగాయి.

'నీ బట్టలూ, పుస్తకాలు, జీతం నేను చూసుకుంటాను.'

'కానీ! నేను కొలువు జెయ్యాలి కదా' కళ్ల నీళ్ల పెట్టుకున్నాడు బిచ్చా.

'నువ్వు కొలువు జేస్తే ఒచ్చే జీతమెంత?' అడిగాడు మాష్టరు.

'ముప్పై రూపాయలు' 'అవి నేనిస్తాలే' నువ్వు మా ఇంట్లోనే వుండి చదువుకో బిచ్చు అతని కాళ్ల మీద పడ్డాడు! మాష్టరు నవ్వుతూ

'బాగా చదువుకో' అని ఆశీర్వదించారు.

'సార్! నేను ఐ.ఏ.ఎస్ చదువుతాను. చేర్పించరూ?' ఇంగుతిన్నారు మాష్టరు.

* * *

హాల్లో మాష్టారి ఫోటో నవ్వుతూ కనిపించింది 'భిక్షపతి! నువ్వు ఇంత ఎత్తు ఎదిగినా, నన్ను మరిచిపోకుండా, నా అడుగుజాడల్లో నడుస్తున్నందుకు నాకెంతో గర్వంగా వుందయ్యా' ఫోటో మాట్లాడి నట్టనిపించింది! దగ్గరికి వెళ్లాడు. "ఒక దీపం వెయ్యి దీపాలు వెలిగించాలి! ఒక విద్యావంతుడు కనీసం మరొక విద్యావంతుణ్ణి తయారుచెయ్యాలి' మాష్టారు మాటలు బంగారు భిక్షపతి ఐ.ఏ.ఎస్ చెవుల్లో రింగుమన్నాయి. అప్రయత్నంగా ఫోటోలో మాష్టారు పాదాలనికి నమస్కరించాడు పతి.

'ఏమిటి సంగతి? రాగానే మాష్టారుకి నమస్కారం చేస్తున్నారు?' అడిగింది అరుంధతి.

జరిగినదంతా చెప్పాడు పతి!

అరుంధతి కళ్ల అశ్రుపూరితాలయ్యాయి!

బాధతో కాదు!...

దుఃఖంతో కాదు!...

ఆర్ద్రతతో! ఆప్యాయతతో! అనురాగంతో!...

"ఏమండీ! మీలాంటి మనసున్న మనిషి, గురువుగారి మీద, దేముడి మీదకన్నా ఎక్కువభక్తి గలవ్యక్తి, కోటికి ఒక్కరున్నా చాలు. నీతి న్యాయం భూమ్మీద ఇంకా నిలబడుతుంది"అంటూ భర్త గుండె మీద తల ఆనించింది ఆనందంతో!

"అరుంధతి నీటన్నిటికీ తోడు తలపెట్టిన కార్యాలకి అడ్డుపడకుండా చేయూతనిస్తూ అండగా నిలిచే అనుకూలవతి అయిన భార్య కూడా అందరికీ దొరుకుతుందా? అందరూ అరుంధతిలా

వుంటే?”

'సాండీ... మరీ సాగదీస్తున్నారు?'

'ఊ... అయితే ఏదీ... పప్పీ... ఇవ్వు... ఎప్పుడూ వాడికేనేంటి? బబ్లూగాడు పుట్టి రెండేళ్లకాలేదు. వాడు పప్పీ' అనగానే ముద్దులు కురిపించేస్తావ్? నేను సీనియర్నోయ్! వాడు నాకంటే ఎంత జూనియర్! అయినా వాడే గెలుస్తాడు. వాణ్ణి చూస్తుంటే నాకు జెలసీగా వుంది' అన్నాడు అధరాలలోని మధువునందుకోబోతూ పతి.

"మమ్మీ... నా డాల్... ఏదీ?" అంటూ ఒచ్చిన బబ్లూని చూసి తక్కున వెనక్కి జరిగింది అరుంధతి నవ్వుతూ!

ఒక్క నిముషం కోపం వచ్చినా, వెంటనే అరుంధతి నవ్వులతో తమా శ్రుతి కలిపాడు పతి. ఆ గదంతా నవ్వులు ప్రతిధ్వనించాయి.

మాస్టారి ఫోటో కూడా చిలిపిగా నవ్వింది, ఈ నవ దంపతులని చూసి!

"మే... ఐ... కమిన్ సార్..." వరండాలో నుంచే దండం పెడుతూ నుంచున్న అతణ్ణి చూసి నవ్వుతూ 'ఎస్' అన్నాడు పతి.

'సార్! నేను ఏ.ఎస్.పి విజయవాడ సార్. నన్ను ఈ ఊరికి విశాఖపట్నం ట్రాన్స్ఫర్ చేశారు సార్! రేపే రిపోర్టు చెయ్యాలి! ఈ ఎస్.పిగారు లీవులో వున్నారు సార్!

మా ఆవిడకి ప్రసవించే రోజులు! ముగ్గురు చిన్న చిన్న పిల్లలు. ఇంట్లో చేసే వాళ్లెవరూ లేరు. మీరు దయదలచి ఒక పదిహేను రోజులు లీవిప్పిస్తే... అందుకనే ముందు కలెక్టర్ గారిని కలుసుకుందామని వచ్చాను. సార్! కాదనకండి! ఇవి చేతులుకావు' ప్రాధేయపడుతూన్న అతణ్ణి చూసి 'మీ పేరు' అడిగాడు పతి.

'రాజాచంద్ర...'

ఉలిక్కిపడ్డాడు పతి! నోట మాట రాలేదు. సరేనన్నట్టుగా తలూపాడు.

రాజాచంద్ర 'థాంక్స్ సర్'... అంటూ వెళ్లిపోయాడు.

"ఏం లోకంలో వున్నారు సార్! మర్చిపోయారా మనం సినిమా కెళ్దామనుకున్నాంగా?" అంది అరుంధతి.

"ఒస్తున్నా..." అంటూ లేచాడు పతి!

సినిమా చూస్తున్నంత సేపూ రాజాచంద్ర రూపమే కళ్లకి కట్టినట్లు కనబడుతోంది పతికి. పండిపోయిన జుట్టూ, ఊడిపోయిన పళ్లూ, ముసలాడిలా వున్నాడు

సినిమా చూస్తున్న అతని ఆలోచనలు మాస్టారి పైనా, రాజాచంద్ర పైనా తిరుగుతూ చిన్నప్పటి సంఘటనలు కళ్లముందు మెదులుతున్నాయ్! సినిమా రీళ్లలా తిరుగుతున్నాయ్ బుర్రలో! తను ఎన్నోసార్లనుకున్నాడు, రాజాచంద్ర ఎక్కడున్నాడో ఏంచేస్తున్నాడోనని! ఇన్నాళ్లకి, తన కింద, తన జిల్లాలో "ఓహ్! ఫేట్... ఈజ్... ఫన్నీ..." అనుకుని నవ్వుకున్నాడు.

"మాస్టారూ! మీకు గురు దక్షిణంగా ఏమివ్వగలను? జన్మ జన్మలకీ రుణపడి వుండడం తప్ప! 'అంటే' బాబూ! నీ అంతటి వాణ్ణి ఇంకొకణ్ణి తయారుచెయ్యి' అన్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయ్! తృప్తిగా నవ్వుకున్నాడు పతి, ఐ.ఏ.ఎస్ డిస్ట్రిక్ట్ కలెక్టర్! ★